# సత్యవాక్కు

# THE WORD OF TRUTH



## క్రైస్తవ మాసపత్రిక

JUNE 2007

సంవత్సర చందా రూ. 50/-

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న

సత్యవాణి టి.వి. కార్యక్రమములను

ప్రతి మంగళవారం : ఉదయం 6:30 గం॥లకు
'మా' టి.వి. లోను

ప్రతి శుక్రవారం : KTV లోను, IN లో ఉదయం
7:00గం॥లకు,సాయంత్రం
5:30గం॥లకు (కాకినాడలో మాత్రమే)

ప్రతి శనివారం : ఉదయం 6:30 గం॥లకు 'తేజ' ఛానల్
లోను చూడండి

ప్రసంగీకులు : బ్రదర్. జాషువా గూటం
బ్రదర్. లిక్కీ గూటం

సత్యసువార్తను వినండి !!

మీ బంధు మిత్రులకు విన్పించండి !!

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి 28 | జూన్ 2007 | సంచిక 11


## దేవుడు ఆత్మయై యున్నాడు

(God is Spirit)

యేసు ఒకసారి సమరయలోని సుఖారను ఊరికి వచ్చెను. అక్కడ యాకోబు బావి యుండెను గనుక యేసు బావి యొద్ద అలసట తీర్చుకొనుటకు వచ్చెను. సమరయ స్త్రీ ఒక తె నీళ్లు చేదుకొనుటకు అక్కడికి రాగా యేసు ఆమెతో ఆత్మీయ సంగతులను గూర్చి సంభాషించెను. యేసు ఆమెతో ఇట్లనెను: “అమ్మా, ఒక కాలము వచ్చుచున్నది. ఆ కాలమందు ఈ పర్వతము మీదనైనను, యెరూషలేములోనైనను మీరు తండ్రిని ఆరాధింపరు. నామాట నమ్ముము; మీరు తెలియని దానిని ఆరాధించు వారు. మేము మాకు తెలిసిన దానిని ఆరాధించు వారము. రక్షణ యూదులలో నుండియే కలుగు చున్నది. అయితే యథార్థముగా ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను తండ్రిని ఆరాధించు కాలము వచ్చుచున్నది; అది ఇప్పుడును వచ్చే యున్నది; తన్ను ఆరాధించువారు అట్టివారే కావలెనని

తండ్రి కోరుచున్నాడు. దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించు వారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధింప వలెననెను" (యోహాను 4:21-24).

యేసు సమరయ స్త్రీతో మాటలాడుచు దేవుడు ఆత్మయై యున్నాడు అని దైవత్వాన్ని నిర్వచించెను. దేవుడు ఆత్మయై యున్నాడని యేసు చెప్పుటలో ఆయన భావమేమి? ఆస్త్రీతో యేసు మాట్లాడుచు దేవుడు ఆత్మయై యున్నాడనగా ఆయన ఒక పర్వతము మీదనే యుండుననిగాని, లేక ఒక నిర్ణీత స్థలములోనే ఉండుననిగాని దాని యర్థముకాదు. దేవుడు భౌతిక సంగతులను, స్థలములను, అవాంతరములను దాటి అన్ని సమయము లందును, అన్ని చోట్లను యుండువాడని దీని యర్థము. దేవుడు ఆత్మయై యున్నాడనగా ఆయన పదార్థము కాదు అని మనము గ్రహించవలెను. దేవుడు పదార్థమయితే ఆయన ఒక వస్తువువలె యుండును. దేవుని మనము వస్తువుగా మార్చిన యెడల ఆ వస్తువును మనము ఎక్కడ ఉంచితే అక్కడే యుండును. మన యిష్టా యిష్టములను బట్టి ఆ వస్తువు ఉండే స్థలమును మనము నిర్ణయించు కొన వచ్చును. అయితే దేవుడొక పదార్థముకాదు; వస్తువు కాదు. ఆయన ఒక విగ్రహము కాదు. దేవుడు ఆత్మయై యున్నాడు. ఆత్మ పదార్థము కాదు. దేవుడు ఆత్మ గనుక ఆయన అన్ని చోట్ల యుండువాడు. అన్ని సమయముల లోను ఉండువాడు. అందుకే యెహోవా దేవుడు ''నేను ఉండువాడను అనువాడనై యున్నానని'' చెప్పు చున్నాడు.

"యెహోషువ, దేవుని దయ పొందినవాడై యాకోబు యొక్క దేవుని నివాస్థలము కట్టగోరెను. అయితే సొలొమోను ఆయన కొరకు మందిరము కట్టించెను. అయినను ఆకాశము నా సింహాసనము. భూమి నా పాదపీఠము. మీరు నా కొరకు ఏలాటి మందిరము కట్టుదురు? నా విశ్రాంతి స్థలమేది? ఇవన్నియు నా హస్త కృతములు కావా? అని ప్రభువు చెప్పుచున్నాడు'' అని అపో. కా. 7:46-50లో వ్రాయబడెను. "నిశ్చయముగా దేవుడు ఈ లోకమందు నివాసము చేయుడు: ఆకాశ మహాకాశములు సహితము నిన్ను పట్టజాలవు; నేను కట్టించిన

మందిరము ఏలాగు పట్టును?" అని సొలొమోను మహారాజు పలికెను (1 రాజు 8:27). "నేను సమీపమున నుండు దేవుడను మాత్రమేనా? దూరమున నుండు దేవుడను కానా? యెహోవా సెలవిచ్చిన మాట ఏదనగా - నాకు కనబడకుండ రహస్య స్థలములలో దాగగల వాడెవడైన కలడా? నేను భూమ్యాకాశము లయందంతట నున్న వాడను కానా? యిదే యెహోవా వాక్కు" అని ఆయన యిర్మియా 23:22-24లో చెప్పుచున్నాడు.

దేవుని ప్రవక్తయైన దావీదు ఇట్లనుచున్నాడు: "యెహోవా, నీవు నన్ను పరిశోధించి తెలిసికొని యున్నావు. నేను కూర్చుండుట, నేను లేచుట నీకు తెలియును. నాకు తలంపు పుట్టకమునుపే నీవు నా మనస్సు గ్రహించుచున్నావు..... నీ ఆత్మ యెద్దనుండి నేనెక్కడికి పారిపోవుదును? నీ సన్నిధి నుండి నేనెక్కడికి పారిపోవుదును? నేను ఆకాశమున కెక్కినను నీవు అక్కడను ఉన్నావు. నేను పాతాళమందు పండుకొనినను నీవు అక్కడను ఉన్నావు. నేను వేకువ రెక్కలు కట్టుకొని సముద్ర దిగంతములలో నివసించినను అక్కడను నీ చేయి నన్ను నడిపించును. నీ కుడిచేయి నన్ను పట్టుకొనును"(కీర్తన 139:1-10).

ఇప్పటివరకు మనము చూచిన ఈ లేఖనములన్నియు యేసుక్రీస్తు సమరయ స్త్రీతో చెప్పిన గొప్ప సత్యమును, అనగా దేవుడు ఒకే ఒక్క స్థలములో యుండువాడు కాదు అను గొప్ప సత్యమును నొక్కి వక్కాణించి చెప్పుచున్నవి. దేవుడు ఒక్క స్థలములో మాత్రమే యుండువాడు కాదుగాని ఆయన సర్వాంతర్యామి. అనగా ఆయన అన్ని సమయములందును అన్ని చోట్లను ఉండువాడు. ఆయన ఆత్మ గనుక ఆయ సర్వాంతర్యామియై యున్నాడు. ఆయన సర్వాంతర్యామి. దేవుడు ఎంత గంభీరుడంటే-ఆయన ఈ విశ్వమంతటని ఆవరించుకొని యున్నవాడు. అయినను దేవుడు ఎంత సూక్ష్మమైనవాడంటే ఆయన మన హృదయములలో నివసింపగలవాడు. అందుకే "పరిశుద్ధుడును, నిత్య నివాసియునైనవాడు ఈలాగు సెలవిచ్చుచున్నాడు-నేను మహోన్నత

మైన పరిశుద్ధ స్థలములలో నివసించువాడను, అయినను వినయము గలవారి ప్రాణమును ఉజ్జీవింపజేయుటకును, నలిగినవారి ప్రాణమును ఉజ్జీవింపజేయుటకును, వినయము గలవారి యొద్దను, దీన మనస్సు గలవారి యెుద్దను నివసించుచున్నాను" (యెష 57:15). "మీ దేహము దేవుని వలన మీకు అనుగ్రహింపబడి, మీలోనున్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని మీరెరుగరా? మీరు మీ సొత్తుకారు, విలువ పెట్టి కొనబడినవారు గనుక మీ దేహముతో దేవుని మహిమపరచుడి" యని పౌలు క్రైస్తవులను హెచ్చరించెను (1 కొరింథి 6:19, 20). "నేను వారిలో నివసించి సంచరింతును, నేను వారి దేవుడనై యుందును, వారు నా ప్రజలై యుందురు" అని క్రైస్తవులను గూర్చి దేవుడు పలికెను (2 కొరింథీ 6:16). ఇది క్రైస్తవులకు గొప్ప ఆదరణ కలిగించును. దేవుడు అన్నిటిని, అందరినీ చూచువాడని, మన ప్రార్ధనలు విని జవాబు దయచేయువాడని గ్రహించుట ఎంతో ఆశ్చర్యకరమైనది.

దేవుడు ఆత్మయై యున్నాడు. గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధింపవలెను అని యేసు చెప్పెను. దేవుడు ఆత్మ గనుక మానవుడు ఆయనను ఆత్మతో ఆరాధింపవలెను. దైవమానవాత్మలకు అన్యోన్య సహవాసము మానవుడు చేయు ఆరాధనలో లభించును. ఆరాధనలో మానవుని ఆత్మ, దేవుని ఆత్మను స్తుతించుచు, కొనియాడుచు ఉచ్ఛస్థితికి చేరుకొనును. అప్పుడు మాత్రమే మానవాత్మకు సంతృప్తి లభించును. అందు వలన మానవుడు ఈ లోకములో యున్న వస్తువులను ఆరాధించుటలో ఆత్మీయముగా ఉన్నత స్థాయికి చేరుకొనలేడు. ఏలయనగా నిర్జీవ వస్తువులకు ఆత్మలేదు. అవి కేవలము పదార్ధము మాత్రమే. అందువలన అవి ఆత్మకాదు. విగ్రహారాధనలో దైవ,మానవాత్మల కలయిక సంభవించదు. స్తుతిగీతములు నాలకించు వానిని, ప్రార్ధనలను విని, ప్రత్యుత్తరముల నిచ్చు వానిని మానవుడు ఆరాధింపగోరును. అయితే మానవుడు ఇచ్చు అర్పణలను చూడకను, వినకను, ప్రత్యుత్తరమీయకను యున్న దానిని అతడెట్లు ఆరాధింపగలడు? మానవుని

సేవను గ్రహించుకొనలేని 'మూర్తిత్వముతో' అతడు అన్యోన్య సహవాసమును ఎట్లు కలిగియుండ గలడు? అట్టిది అసాధ్యము. "నిశ్చయముగా కొండల మీద జరిగినది మోసకరము, పర్వతముల మీద చేసిన ఘోష నిష్ప్రయోజనము. నిశ్చయముగా మా దేవుడైన యెహోవా వలన ఇశ్రాయేలునకు రక్షణ కలుగును" అని అందుకే యిర్మియా వ్రాసెను (యిర్మియా 3:23).

మానవుని ఆరాధన ఆత్మతోను, సత్యముతోను ఉన్నప్పుడు దేవుడు దానిని గ్రహించి, సంతోషించును. అట్టి ఆరాధనలో ఒక ఆత్మ వేరొక ఆత్మతో లీనమగుట సంభవించును. అందువలన దేవుడు తనను గూర్చి తానును, మిగిలిన అన్ని సంగతులను, ఎరిగినట్టి మూర్తియై యున్నాడు. మానవుడు తనకంటె ఉన్నతమైన వానిని ఆదర్శమూర్తిగా యెంచి ఆరాధించును. అట్టి ఉన్నత ఆదర్శమును అతడు భౌతికవస్తువులలో దేనిలోను కనగొనలేడు. అట్టి ఆదర్శము ఒక జంతువులోగాని, వృక్షములోగాని అతనికి లభించదు. ఏలయనగా సామాన్య మానవుడెవడు ఒక జంతువుగా గాని, వృక్షముగా గాని తయారు కావలెనని ఆశించడు. అయితే ఒక ఆత్మను మానవుడు ఆదర్శముగా చేసికొని, దాని ననుకరించి, ఆరాధించగలడు. అందువలన ఆత్మయైన దేవునిలో మానవుడు అన్వేషించు లక్షణములు అనగా ప్రేమ, కరుణ, కటాక్షము, దయ, దీర్ఘ శాంతము, మంచితనము, కృప మొ॥నవి యుండవలెను. బైబిలు సూచించు దేవుడు యేసుక్రీస్తు వలె మన మధ్య జీవించెను. ఆత్మయైన దేవుని లక్షణములన్నిటిని ఆయన కలిగి యుండెను. అందుకే ఆత్మయైన దేవుని నారాధించువారు ఆత్మతోను, సత్యముతోను ఆరాధింపవలెనని అని యేసుక్రీస్తు బోధించెను.

– జాషువా గూటం

**I క్రైస్తవులు పిలువబడిన పిలుపునకు తగినట్లుగా నడవాలి:** "కాబట్టి, మీరు సమాధానమును బంధముచేత ఆత్మ కలిగించు ఐక్యమును కాపాడుకొనుట యందు శ్రద్ధ కలిగిన వారై, ప్రేమతో ఒకనినొకడు సహించుచు, మీరు పిలువబడిన పిలుపునకు తగినట్లుగా దీర్ఘశాంతముతో కూడిన సంపూర్ణ వినయముతోను సాత్వికముతోను నడుచుకొనవలెను" (ఎఫెసీ 4:1-3).

ప్రశ్న: పిలువబడిన పిలుపు ఏమిటి? ఆ పిలుపు ఎవరిది?

"పరిశుద్ధులగుటకే దేవుడు మనలను పిలిచెను గాని, అపవిత్రులుగా ఉండుటకు పిలువలేదు" (I థెస్సలోనీక 4:7).

"తన రాజ్యమునకును మహిమకును మిమ్మును పిలుచుచున్న దేవునికి తగినట్టుగా మీరు నడుచుకొనవలెనని మేము మీలో ప్రతివానిని హెచ్చరించుచు, ధైర్యపరచుచు సాక్ష్యమిచ్చుచు, తండ్రి తన బిడ్డల యెడల నడుచుకొను రీతిగా మీలో ప్రతివాని యెడల మేము నడుచుకొంటిమని" అపొస్తలుడైన పౌలు తెలుపుచుండెను (I థెస్సలోనీక 2:11-12).

"ఆత్మానుసారముగా నడుచుకొనుడి, అప్పుడు మీరు శరీరేచ్ఛను నెరవేర్చరు. శరీరము ఆత్మకును ఆత్మ శరీరమునకును విరోధముగా అపేక్షించును. ఇవి యొకదానికొకటి వ్యతిరేకముగా ఉన్నవి గనుక మీరేమి చేయ నిశ్చయింతురో వాటిని చేయకుందురు" (గలతీ 5:16-17). "మనము ఆత్మననుసరించి జీవించువారమైతిమా ఆత్మను అనుసరించి క్రమముగా నడుచుకొందుము" (గలతీ 5:25). పైన చెప్పిన విధముగా మనము సంఘములో నడచిన యెడల ఆ ఆత్మను జీవింపజేయుగము లేనియెడల, ఆత్మను ఆర్పివేయుగలవారముగా అగుదుము, అపవిత్రులుగా పిలువబడుదుము. "శరీరము ననునరింపక ఆత్మననుసరించియే నడుచుకొను మన యందు ధర్మశాస్త్రసంబంధమైన నీతి విధి నెరవేర్చబడవలెనని పాప పరిహారము నిమిత్తము దేవుడు తన సొంత కుమారుని పాప శరీరాకారముతో పంపి,

ఆయన శరీరమందు పాపమునకు శిక్ష విధించెను (రోమా 8:3-4). మన కొరకు, ఏ పాపమూ చేయని క్రీస్తు మరణమును పొంది, దానిని జయించి తిరిగి లేచియున్నారు. అటువంటి ప్రేమగల ఆయనయు (క్రీస్తుయు), దేవుడైన తండ్రియు, దేవుని వాక్యమూ దూషింపబడకుండునట్లు మనము మన "ప్రవర్తనయందు భయభక్తులు గలవారముగా ఉండవలెను" (తీతు 2:3-5). "మనమందరమునూ ఒక్క భావముతో సువార్త విశ్వాసపక్షమును మనలను ఎదిరించువారితో పోరాడుచూ, ఏక మనస్సుగలవారమై, క్రీస్తు సువార్తకు తగినట్లుగా ప్రవర్తించుడి" (ఫిలిప్పీ 1:27-28). "కాగా మీరేలాగు నడుచుకొని దేవుని సంతోషపరచవలెనో మా వలన నేర్చుకొనిన ప్రకారముగా మీరు నడుచుకొనుచున్నారు" (I థెస్స లొనీక 4:2) (II యోహాను: 4 & III యోహాను: 4).

**II. దేవుని ప్రేమలో నడవాలి:**

"క్రీస్తు మిమ్మును ప్రేమించి, పరిమళ వాసనగా ఉండుటకు మనకొరకు తన్ను తాను దేవునికి అర్పణముగాను బలిగాను అప్పగించుకొనెను; అలాగుననే మీరునూ ప్రేమ కలిగి నడుచుకొనుడి" (ఎఫెస్సి 5:2). "మనమాయన ఆజ్ఞల ప్రకారము నడుచుటయే ప్రేమ; మీరు మొదటి నుండి వినిన ప్రకారము ప్రేమతో నడుచుకొనవలెను అనునదియే ఆ ఆజ్ఞ" (II యోహాను : 6). మంచి ప్రవర్తన కలిగియుండువారు ఇతరులతో ప్రేమగా నడుచుకుంటారు. "అజ్ఞానులవలె కాక జ్ఞానులవలె నడుచుకొనునట్లు జాగ్రత్తగా చూచుకొనుడి" (ఎఫెస్సి 5:15).

"సహోదరులారా, మీరు ప్రేమ యందు మరియెక్కువగా అభివృద్ధి నొందుచుండవలెననియు, సంఘమునకు వెలుపటివారి యెడల మర్యాదగా నడుచుకొనుచు, మీకేమియు కొదువ లేకుండునట్లు మేము మీకు ఆజ్ఞాపించిన ప్రకారము మీరు పరులజోలికి పోక, మీ సొంత కార్యములను జరుపు కొనుటయందును మీ చేతులతో పనిచేయుటయందును ఆశ కలిగి యుండవలెననియు, మిమ్మును హెచ్చరించుచున్నాము అని I థెస్సలొనీక 4:12 లో పౌలు ద్వారా వ్రాయబడి యున్నది. మనము చూపు ప్రేమలోను, ప్రవర్తనలోను మనవే అనేకమైన

విశ్వాసులకు, మన ఇరుగు పొరుగు వారికి మాదిరిగా ఉండాలి ( I తిమో 4:12). ఆదర్శంగా మనము ప్రేమకలిగి నడుచుకొవాలి/ప్రవర్తించాలి.

**III. వెలుగు సంబంధులవలె నడవాలి:**

"మీరు పూర్వమందు చీకటియై యుంటిరి, ఇప్పుడైతే ప్రభువునందు వెలుగైయున్నారు" (ఎఫెస్సి 5:8).

ప్రశ్న: వెలుగు ఫలము మనకు ఎక్కడ కనబడును?

"సమస్త విధములైన మంచితనము, నీతి, సత్యమను వాటిలో వెలుగు ఫలము కనబడుచున్నది" (ఎఫెస్సి 5:9-10) "గనుక ప్రభువుకేది ప్రీతికరమైనదో దానిని - పరీక్షించుచు, వెలుగు సంబంధులవలె నడుచుకొనుడి"

ఉదా: హనోకు - ఆది. 5:24

నోవహు - ఆది. 6:9

పైన చెప్పిన మంచితనము, నీతి, సత్యము, ఇంకా అనేకమైన ఆత్మ ఫలములన్నియు మన తండ్రియైన దేవునిలో ఉన్నవి. అవన్నియు కలిగిన దేవుడు గొప్ప వెలుగువలె ప్రకాశించు చున్నారు. ఆ వెలుగు కలిగిన ఆయనతో పాటుగా హనోకు, నోవహు నడిచియున్నారు. వీరిని విశ్వాసులమైన మనము మాదిరిగా తీసుకొని అలాగు ప్రవర్తింపవలెను. దేవుడు మనకు చూపిన మంచి మార్గములో నడువవలెను.

"అయితే మీ పూర్ణ హృదయము తోను మీ పూర్ణాత్మతోను మీ దేవుడైన యెహోవాను ప్రేమించుచు, ఆయన మార్గములన్నిటిలో నడుచుకొనుచు, ఆయన ఆజ్ఞలను గైకొనుచు, ఆయనను హత్తుకొని ఆయనను సేవించుచు, యెహోవా సేవకుడైన మోషే మీకాజ్ఞాపించిన ధర్మమును ధర్మ శాస్త్రమును అనుసరించి నడుచుకొనుడి" (యెహూషువ 22:5).

"యెహోవా వెలుగులో నడుచు కొందుము రండి" అని యెషయా చెప్పుచున్నాడు (యెష 2:5).

"యెహోవా ముఖకాంతిని చూచి నడుచుకొనుచున్నవారివలె" మనమును వెలుగు ఫలములను ధరించుకొని నడుచుకొని నడువవలెను (కీర్త 89:15).

"మనుష్యుడా, యేది ఉత్తమమో అది నీకు తెలియజేయబడియున్నది; న్యాయముగా నడుచుకొనుటయు, కనికరమును ప్రేమించుటయు,

దీనమనస్సు కలిగి నీ దేవుని యెదుట ప్రవర్తించుటయు, ఇంతేకదా యెహోవా నిన్నడుగుచున్నాడు" (మీకా. 6:8).

"(ఆయన) దేవుడు వెలుగై యున్నాడు. అయితే ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడిచినయెడల, మనము అన్యోన్యసహవాసము గలవారమై యుందుము" (I యోహాను 1:5 & 7).

"నేను పరిశుద్ధుడనై యున్నాను గనుక మీరును పరిశుద్ధులై యుండడని వ్రాయబడియున్నది. కాగా మీరు విధేయులగు పిల్లలై, మీ పూర్వపు అజ్ఞానదశలో మీకుండిన ఆశల ననుసరించి ప్రవర్తింపక, 'మిమ్మును పిలిచినవాడు' పరిశుద్ధుడైయున్న ప్రకారము మీరును సమస్త ప్రవర్తనయందు పరిశుద్ధులై యుండుడి" (I పేతురు 1:14-16).

"పరిశుద్ధమైన ప్రవర్తనతోను భక్తితోను ఎంతో జాగ్రత్త గలవారై యుండవలెను" (II పేతురు 3:12).

"మనము భక్తిహీనతను, ఇహలోక సంబంధమైన దురాశలను విసర్జించి, శుభప్రదమైన నిరీక్షణ నిమిత్తము, యేసుక్రీస్తు మహిమయొక్క ప్రత్యక్షత కొరకు ఎదురుచూచుచు, ఈ లోకములో స్వస్థబుద్ధితోను, నీతితోను, భక్తితోను బ్రదుకుచుండవలెనని మనకు బోధించుచున్నది" (తీతు 2:12-13).

**IV. అన్యులు నడుచుకొనునట్లు మనము (క్రైస్తవులు) నడువకూడదు:**

"మనమందరము విశ్వాస విషయములోను దేవుని కుమారుని గూర్చిన జ్ఞానవిషయములోను ఏకత్వము పొంది, సంపూర్ణ పురుషులమగు వరకు, అనగా క్రీస్తునకు కలిగిన సంపూర్ణతకు సమానమైన సంపూర్ణత కలవారమగు వరకు, ఆయన ఈలాగు నియమించెను" (ఎఫెస్సి 4:11-12).

అన్యజనులకు ఇష్టమైన పోకిరి చేష్టలు, దురాశలు, మద్యపానము, అల్లరితో కూడిన ఆటపాటలు, త్రాగుబోతుల విందులు, చేయదగని విగ్రహపూజలు మొదలైనవాటి యందు మనము నడువకూడదు ..(I పేతురు 4:3).

"అల్లరితో కూడిన ఆటపాటలైనను మత్తయినను లేకయు, కామవిలాసము లైనను పోకిరిచేష్టలైనను లేకయు, కలహమైనను మత్సరమైనను లేకయు, పగటియందు నడుచుకొన్నట్టు

మర్యాదగా నడుచుకొందము" (రోమా 13:13).

"ప్రియులారా, అంత్యకాలమునందు తన భక్తిహీనమైన దురాశల చొప్పున నడుచు పరిహాసకులుందురని మన ప్రభువైన యేసుక్రీస్తు అపొస్తలులు పూర్వమందు మీతో చెప్పిన మాటలను జ్ఞాపకము చేసికొనుడి. అట్టివారు ప్రకృతి సంబంధులును ఆత్మ లేనివారునై యుండి భేదములు కలుగజేయుచున్నారు" (యూదా:18). అలాంటి వారికి మనము దూరముగా ఉండాలి.

"దుష్టసాంగత్యము మంచి నడవడిని చెరుపును" (I కొరింధి 15:33).

"నీతి ప్రవర్తన గలవారై మేల్కొని, పాపము చేయకుడి" (I కొరింధి 15:34). "యేసు-నేను లోకమునకు వెలుగును, నన్ను వెంబడించువాడు చీకటిలో నడువక జీవపు వెలుగు గలిగి యుండును" (యోహాను 8:12). "ఆయనతో కూడ సహవాసము గలవారమని చెప్పుకొని చీకటిలో నడిచిన యెడల మనమబద్ధమాడుచు సత్యమును జరిగింపకుందుము. అయితే ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడిచిన యెడల, మనము అన్యోన్య సహవాసము గలవారమైయుందుము" (I యోహాను 1:6-7).

"దినములు చెడ్డవి గనుక, మీరు సమయమును పోనియ్యక సద్వినియోగము చేసికొనుచు, అజ్ఞానులవలె కాక, జ్ఞానుల వలె నడుచుకొనునట్లు జాగ్రత్తగా చూచుకొనుడి (ఎఫెస్సి 5:15). ఈలాగున "యధార్థముగా ప్రవర్తించువారికి ఆయన (దేవుడు) యే మేలును చేయకమానడు" (కీర్త 84:11).

మనము దేవునికి ఇష్టులుగా ఉండునట్లు ప్రవర్తించాలి. "యధార్థముగా ప్రవర్తించువారు ఆయన కిష్టులు" (సామె. 11:20).

"తమ ప్రవర్తనను కనిపెట్టియుండుట వివేకుల జ్ఞానమునకు లక్షణము" (సామె 14:8).

"తన ప్రవర్తన కనిపెట్టువాడు తన ప్రాణమును కాపాడుకొనును" (సామె 16:17).

**- సుదీవ గూటం, కాకినాడ**

ప్రకటన గ్రంథ ప్రసంగ మాలిక - 10

## తీర్పు అమలు

### (The Execution of Judgement)

(ప్రకటన 6వ అధ్యాయము)

**పరిచయము:**

A. ప్రకటన గ్రంథం మొదటి అధ్యాయాల్లో యోహాను పద్మాసు ద్వీపంలో బందీగా యున్నపుడు పరలోక దర్శనములు చూస్తాడు. ఆసియాలోని ఏడు సంఘములు, యేసు వాటికి వ్రాసిన పత్రికలను చూసాము. వారి యొక్క సాధక బాధకాలు, శోధనలు, కష్టాలు గమనించాము. అవి అన్ని చోట్ల యుండు సంఘములు ఎదుర్కొను సమస్యలే. 4వ అధ్యాయంలో పరలోక ద్వారము తెరువబడగా దేవుని సింహాసనమును, అందు ఆసీనుడైనవానిని యోహాను చూడ గలిగాడు. దేవుని యొక్క భీకర మహిమను, ఆయన సింహాసనాన్ని యోహాను మనకు వర్ణించాడు. 4,5 అధ్యాయాల్లో సమస్తమును దేవుని కంట్రోలులో యున్నదని భవిష్యత్తు దేవుని చేతుల్లో యున్నదనే నిర్ధారణ మనకు ఇయ్యబడింది. 5వ అధ్యాయంలో ముద్రలు వేయబడిన గ్రంధమును విప్పుటకు వధింపబడిన గొర్రెపిల్ల యోగ్యుడని, పూజార్హుడని తెలియజేయబడింది.

B. ఆరవ అధ్యాయంలో ఆ గ్రంధముకు వేయబడిన 7 ముద్రలలో ఆరు ముద్రలు విప్పబడ్డాయి. మొదటి వచనంలో ఆ గొర్రెపిల్ల మొదటి ముద్రను విప్పుట చూస్తాము. ఉరుము వంటి గొప్ప స్వరమును యోహాను వినెను.

C. నాలుగు జీవులలో ఒకడు 'రమ్ము' అని చెప్పెను. ఈమాట అతడు యోహానుకు కాదు గాని, నాలుగింటిలో ఒక గుర్రముకు చెప్పెను. వర్తమానము నందించుటకు నాలుగు గుర్రములు

ఉపయోగింపబడును జెకర్యా 6:1-8లో చూడగలము.

**గమనిక:**

ప్రకటన గ్రంథము అనేక గురుతులతో వ్రాయబడినది. గనుక ఈ గురుతుల భావమును గ్రహించుకొనుట అత్యవుసరము. వాటి భావమును వివరించుటకు సాధ్యమైనంత మట్టుకు బైబిలునే వినియోగించుటకు ప్రయత్నించుదాం.

**I. తెల్లని గుర్రము (2వ).**

"మరియు నేను చూడగా, ఇదిగో ఒక తెల్లని గుర్రము కనబడెను; దాని మీద ఒకడు విల్లు పట్టుకొని కూర్చుండి యుండెను. అతనికి కిరీటమియ్యబడెను; అతడు జయించుచు, జయించుటకు బయలు వెళ్లెను".

A. దీని అర్థమేమిటి? యిది క్రీస్తును సూచించుచున్నది. ఎట్లు? ప్రకటన గ్రంథములో ఇంకొకసారి మాత్రమే తెల్లని గుర్రమును గూర్చి చెప్పబడెను. ప్రకటన 19:11-13 ఇట్లు చెప్పుచున్నది: "మరియు పరలోకము తెరువబడియుండుట చూచితిని. అప్పుడిదిగో తెల్లని గుర్రమొకటి కనబడెను. దాని మీద కూర్చుండి యున్నవాడు నమ్మకమైనవాడును సత్యవంతుడను నామము గలవాడు. ఆయన నీతినిబట్టి విమర్శచేయుచు యుద్ధము జరిగించుచున్నాడు. ఆయన నేత్రములు అగ్నిజ్వాల వంటివి. ఆయన శిరస్సు మీద అనేక కిరీటములుండెను.. రక్తములో ముంచబడిన వస్త్రము ఆయన ధరించుకొనెను. మరియు దేవుని వాక్యము అను నామము ఆయనకు పెట్టబడియున్నది".

B. దేవుని వాక్యము! ఈయన ఎవరో మనకు తెలుసు! ఆయన శరీరధారియైన వాక్యము. యేసుక్రీస్తు.

C. తెల్లని గుర్రము మీద యున్నవాడు జయించుచు, జయించుటకు బయలు వెళ్లెను. జయించుట, జయించువాడు, అనుమాటలు ప్రకటన గ్రంథములో తరుచు కనబడ్తాయి. యివి క్రీస్తుకు ఆయన అనుచరులకు వర్తిస్తాయి. (ప్రక 3:21; 5:5). "లోకములో మీకు (యోహాను 16:33). యూదా గోత్ర

సింహము ఏడు ముద్రలు విప్పుటకై జయము పొందెనని ప్రక 5:5లో చెప్పబడినది.

D. ప్రకటన 14:14లో "మరియు నేను చూడగా తెల్లని మేఘము కనబడెను. మనుష్యకుమారుని పోలిన యొకడు ఆ మేఘము మీద ఆసీనుడై యుండెను. ఆయన శిరస్సు మీద సువర్ణ కిరీటము, చేతిలో వాడిగల కొడవలి యుండెను అని వ్రాయబడెను. యేసును అక్కడ సువర్ణ కిరీటము ధరించిన వానిగా చూస్తాము.

E. కీర్తన 45:3-6లో "శూరుడా నీ కత్తి మొలను కట్టుకొనుము. నీ తేజస్సును నీ ప్రభావమును ధరించుకొనుము. సత్యమును వినయముతో కూడిన నీతిని స్థాపించుటకు నీ ప్రభావము ధరించుకొని వాహనమెక్కి బయలు దేరుము. నీ దక్షిణ హస్తము భీకరమైన వాటిని జరిగించుటకు నీకు నేర్పును. **నీ బాణములు వాడి గలవి**... దేవా నీ సింహాసనము నిరంతరము నిలుచును. నీ రాజదండము న్యాయార్థమైన దండము" అని క్రీస్తును గూర్చి ప్రవచింపబడినది. హెబ్రీ 1:8 ని బట్టి కీర్తనలు 45లో చెప్పబడినది క్రీస్తును గూర్చియే యని తెలిసికొన గలము.

F. ప్రకటన 6వ అధ్యాయములో మన కొరకు వధింపబడిన యేసు క్రీస్తు మరణాన్ని జయించి తిరిగి లేచి, దేవుని కుడి పార్శ్వమునకు హెచ్చింపబడి జయించుటకును, రాజ్యమేలుటకును బయలు వెడలినట్లు గమనించగలము. దీనిని ముందే మనం ఎరిగి యుండాలి. ఏలయనగా కొన్ని ఘోరమైన విపత్తులు, హింసలు రాబోవు చున్నాయి. అయినను యేసుక్రీస్తు జయశాలియని, ఆయన ప్రజలు జయిస్తారని మనకు తెలియ జేయబడెను (రోమా 8:37). రాబోవు హింసలను మనం జయించగలము.

**II. ఎఱ్ఱని గుర్రము (3,4,వ)**

A. రెండవ జీవి ఎద్దు ముఖము

వంటిది పిలువగా ఎర్రనిదైన వేరొక గుర్రము బయలు వెళ్లెను.

B. ఈ గుర్రము భూలోకములో సమాధానము లేకుండా చేయుటకు దాని మీద కూర్చున్నవానికి పెద్ద ఖడ్గమియ్యబడెను.

C. మత్తయి 10:34-39 చదువుము. శ్రమలు, హింసలు అనే ఖడ్గము క్రీస్తు సువార్త ఎక్కడికి వెళ్లినా అక్కడకు వచ్చును. "నేను భూమి మీదికి సమాధానము పంప వచ్చితినని తలంచకుడి; ఖడ్గమునే గాని సమాధానము పంపుటకు నేను రాలేదు..." అని యేసు చెప్పెను. క్రీస్తు యేసునందు సద్భక్తితో బ్రదుకనుద్దేశించువారు హింసలు పొలగుదురు" (2తిమో 3:12). మత సంబంధ హింసకు ఈ ఎర్రని గుర్రము గురుతు.

### III. నల్లని గుర్రము (5,6)

A. మనుష్యుని ముఖము వంటి మూడవ జీవి పిలువగా నల్లని గుర్రము కనబడెను. దాని మీద త్రాసు చేత పట్టుకొని ఒకడు కూర్చుండెను. దేనారమునకు ఒకసేరు గోదుమలనియు, దేనారమునకు మూడుసేర్ల యవలలనియు నూనె ద్రాక్షారసము పాడుచేయవద్దని చెప్పబడెను.

B.యిది కరువును సూచించుచున్నది. దేనారము మనుష్యునికి లభించే ఒక రోజు కూలి. దానికి లభించే గోదుములు, యవలలు ఒక రోజుకు సరిపడే గ్రాసము మాత్రమే. యిది భయంకర కరువు కాదుగాని విలాసములకు తావులేని కరువు. నూనె ద్రాక్షారసము పాడుచేయవద్దు అనగా సంపన్నుల పై కరువు ప్రభావముండదు. యిది ఆర్థిక ఇబ్బందులతో కూడిన సమయాన్ని సూచించుచున్నది. అది ముఖ్యముగా దేవుని ప్రజలకు సంభవించును. నల్లగుర్రము మీద కూర్చుని యున్న వాని చేతిలోని త్రాసు వలన అది అన్యాయము ప్రబలి యున్న సమయం అని గ్రహించుకోవచ్చును. రోమా సామ్రాజ్యములో క్రీస్తు సంఘ సభ్యులు వారి విశ్వాసము వలన ఘోరమైన ఆర్థిక యిబ్బందులు నెదుర్కొనవలసివచ్చెను.

## IV. పాండుర వర్ణము గల గుఱ్ఱము (7,8 వచ)

A. యిదొక అసహ్యకరమైన రంగు. అ గుఱ్ఱము మీద కూర్చున్నవాని పేరు మృత్యువు. పాతాళలోకము వానిని వెంబడించెను. మరణం, పాతాళం మానవ రూపము దాల్చినట్లు చెప్పబడెను. (ప్రక 1:17-18, 20:13-14).

B. రెండవ, మూడవ గుఱ్ఱములు బయలు వెడలినప్పుడు దేవుని ప్రజలకు సంభవించు కష్టాలను గమనించాము. ఇప్పుడు సంభవింపబోయే విపత్తు అందరికీ వర్తించును. దేవుని ప్రజలు కూడ అందరితోను బాధలను, మరణాన్ని అనుభవిస్తారు.

C. ఈ విపత్తులు ఖడ్గము వలన, కరవు వలన, మరణము వలన, భూమిలో నుండు క్రూరమృగము వలన కలుగును (8వ). యెహెజ్కేలు 14:21 చూడుము.

D. క్లుప్తముగా ఈ నాలుగు గుఱ్ఱములు లోక సామ్రాజ్యములకు, క్రీస్తు సంఘానికి తెలియజేసిన వర్తమానము. హింసింపబడుచున్న సంఘాన్ని అదుకొనుటకు వారు ఎన్నడు ఊహించని ఆయుధములు దేవుని యొద్ద వున్నాయి! క్రైస్తవులు తమ విశ్వాసము నిమిత్తము మత పర హింసను, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొనుటయే గాక యితరులతో కలిసి విపత్తులను కూడ ఎదుర్కొన వలసి వచ్చును.

## V. న్యాయంముకొరకు అవేదన (9-11వ)

A. ఐదవ ముద్ర విప్పబడెను.

B. పరలోకమందు బలిపీఠము క్రింద వధింపబడిన వారి ఆత్మలను యోహాను చూచెను.

C. వారు దేవుని వాక్యము నిమిత్తమును క్రీస్తును గూర్చి తామిచ్చిన సాక్ష్యము నిమిత్తమును వధింపబడిరి. వారు లోకమంతటా సువార్త బోధించుచుండిరి (కొలస్స 1:23).

D. యోహాను కూడ ఇవే కారణముల వలన పద్మాసు ద్వీపములో బందీగా యుండెను (ప్రక 1:9).

E. "వారు, నాధా సత్యస్వరూపీ,

పరిశుద్ధుడాయెుందాక తీర్పు తీర్చకయు మా రక్తము నిమిత్తము భూ నివాసులకు ప్రతి దండన చేయకయు ఉందువని బిగ్గరగా కేకలు వేసిరి".

న్యాయము తప్పక జరుగునని వారు నమ్మిరి. వారు ప్రకటన 20:4లో చెప్పబడిన శిరచ్ఛేదనము చేయబడిన వారి ఆత్మలై యుండవచ్చును. హేబెలు యొుక్క రక్తము భూమిలో నుండి దేవునికి మొఱ్ఱ పెట్టెను (ఆది.కా. 4:10). దేవుడు ఏర్పరచుకొనిన వారికి ఆయన తప్పక న్యాయము తీర్చును (లూకా 18:7). సాతాను యొుక్క ప్రయత్నాలు విఫలమవుతాయి. దేవుని ప్రజలను వాడు నాశనం చేయలేడు. హతసాక్షులు పరదైసులో స్మృతి కలిగియే యున్నారు. దేవునికి విజ్ఞాపన చేయుచున్నారు (లూకా 16:19-31 చదువుము).

F. తెల్లని వస్త్రము వారిలో ప్రతివానికి ఇయ్యబడెను. జయించు వారికి యిది వాగ్దానము చేయబడెను (ప్రక 3:4). ఈ వస్త్రములు విజయానికి, పవిత్రతకు, ఆనందోత్సాహమునకు నీతికి కూడ గురుతు (ప్రక 19:8).

G. ఇంక కొంచెము కాలము విశ్రమించ వలెనని వారికి చెప్పబడెను. ప్రభువు నందు మృతినొందు మృతులు ధన్యులు. వారు విశ్రాంతి బొందుదురు.

H. వారివలెనే మరికొంతమంది కూడ శ్రమలు పొందబోవుచున్నారని వారి లెక్క పూర్తియగు వరకు వారు విశ్రాంతి బొందాలని తెలియజేయబడెను.

## VI. హింసించినవారికి కలుగు తీర్పు (12-17వ)

A. ఆరవ ముద్ర విప్పబడెను. వెంటనే దేవుని తీర్పు ప్రారంభమాయెను. సూర్యుడు కంబళి వలె నలుపాయెను, చంద్రుడు రక్తవర్ణమాయెను, ఆకాశ నక్షత్రములు భూమి మీద రాలెను, ఆకాశము గ్రంథపు చుట్టవలె చుట్టబడి తొలగిపోయెను. ఇవన్నీ దేవుని ఉగ్రత వలన సంభవింపబోవు ఉగ్రతను తెలియజేయుచున్నవి. ఇట్టి భీకర వర్ణనను యెషయా, యావేలు,

హోషేయ గ్రంథములలో మనము చూడగలము. దేవుడు ఇశ్రాయేలీయులను, తమ చుట్టూ యున్న జనాంగములను శిక్షించునప్పుడు ఉపయోగించిన పదజాలములు యివే. మత్తయి 24లో కూడ క్రీస్తు ఈ రకమైన మాటలను వినియోగించెను.

B. 17వ వచనములో 7 రకములైన మనుష్యులు దేవుని ఉగ్రతను గూర్చి భయకంపితులైనట్లు చెప్పబడినది. మానవజాతి అంతటిలోను వారున్నారు. అల్పులు ఘనులు అందులో యున్నారు.

C. దేవుని తీర్పు ఆసన్నమైనది గనుక వారు ఆయన సముఖమునుండి దాగుకొను ప్రయత్నింతురు. వారు గొర్రెపిల్ల ఉగ్రతనుండి మరుగుచేయబడుటకు దాగుకొన ప్రయత్నింతురు. గొర్రెపిల్ల బహు సాదుజంతువు. అయినను రోమా 11:22లో దేవుని అనుగ్రహము, ఆగ్రహమును గూర్చి చెప్పబడినది. క్రీస్తు కరుణామయుడే గాని శిక్షించుటకు వచ్చేసరికి ఆయన మహోద్రేకుడు.

D. గొర్రెపిల్ల ఉగ్రతకు తాళజాలిన వాడెవడు? 2 థెస్స 1:9లో దానికి జవాబీయబడింది. క్రీస్తు సువార్తకు లోబడక, దేవుని నెరుగక యున్నవారు ఆయన ఉగ్రతను తప్పించుకొన లేరు. ప్రభువుకు చెందిన వారు భయపడ నక్కరలేదు.

**ముగింపు:** సమస్తము దేవుని అదుపులో యున్నది. ఆయన సర్వజ్ఞాని. ఆయన ప్రజలు ఎదుర్కొను శ్రమలను, హింసలను ఎరిగి యున్నాడు. ఆయన దుష్టులను శిక్షించును, తన ప్రజలకు న్యాయము చేయును. దేవుని ఉగ్రత భయంకరమైనది. ఆయన చేతిలో పడుట భయంకరము.

– జాన్ స్టేసీ

# మనము మరువకుండు నిమిత్తము

(Lest we Forget)

క్రొత్తనిబంధన క్రైస్తవ్యమును పునరుద్ధరించుటయే మన కర్తవ్యము. క్రీస్తులో తప్ప వేరొకరిలో రక్షణ లేదు. ఈ గొప్ప ప్రాథమిక సూత్రము దేవుని నుండి కలిగినప్పుడు ఎంత సత్యమో ఇప్పుడును అంతే సత్యము: "దేవుడు లోకమునెంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారుని యందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను'' (యోహాను 3:16).

"సువార్తను గూర్చి నేను సిగ్గుపడు వాడను కాను. ఏలయనగా నమ్ము ప్రతివానికి మొదట యూదునికి, గ్రీసు దేశస్తునికి కూడ రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియై యున్నది" అని మనము చదువగలము (రోమా 1:16). సువార్త యను మాటకు మంచి వార్త యని అర్థము. అయితే ఈ సువార్త యేది? దేవుని వాక్యములో మరల చూచుకొందుము: "మరియు సహోదరులారా, నేను మీకు ప్రకటించిన సువార్తను మీకు తెలియపరచుచున్నాను. మీరు దానిని అంగీకరించితిరి, దానియందే నిలిచి యున్నారు. మీ విశ్వాసము వ్యర్థమైతేనే గాని, నేను ఏ ఉపదేశ రూపముగా సువార్త మీకు ప్రకటించితినో, ఆ ఉపదేశమును మీరు గట్టిగా పట్టుకొని యున్న యెడల ఆ సువార్త వలననే మీరు రక్షణ పొందువారై యుందురు. నాకియ్యబడిన ఉపదేశమును మొదట మీకు అప్పగించితిని ఆదేమనగా లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతిపొందెను సమాధి చేయబడెను, లేఖనముల ప్రకారము మూడవ దినమున లేపబడెను" (1 కొరింథి 15:1-4).

ఈ వాస్తవాలు అన్నివేళలా ప్రకటింపబడవలెనని దేవుడు నిర్ణయించెను. ఈ వాస్తవములను

విశ్వసించుట ద్వారాను, మన ప్రభువైన యేసుక్రీస్తుకు విధేయత చూపుట ద్వారాను మానవులు రక్షింపబడగలరు. పరిశుద్ధాత్మావేశము వలన మార్కు యిట్లు లిఖించాడు: "మరియు మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్త ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును, నమ్మని వానికి శిక్ష విధించబడును" (మార్కు 16:15-16). మత్తయి ఇట్లు వ్రాసాడు: "యేసు వారి యొద్దకు వచ్చి - పరలోకమందును భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడి యున్నది. కాబట్టి మీరు వెళ్లి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రి యొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు, నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటి నన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగ సమాప్తి వరకు సదా కాలము మీతోకూడ ఉన్నానని వారితో చెప్పెను" (మత్తయి 28:18-20). తరువాత, లూకా యిట్లు వ్రాసాడు: "క్రీస్తు శ్రమపడి మూడవ దినమున మృతులలోనుండి లేచు ననియు, యెరూషలేము మొదలుకొని సమస్త జనములలో ఆయన పేరట మారుమనస్సును పాపక్షమాపణయు ప్రకటింపబడుననియు వ్రాయబడి యున్నది. ఈ సంగతులకు మీరే సాక్షులు" (లూకా. 24:46-48).

యేసు ఈ లోకమును విడిచి పరలోకమందున్న తండ్రియొద్దకు ఆరోహణుడగుచుండగా ఈ సంగతులను తన శిష్యులుకు వివరించెను. "అయినను పరిశుద్ధాత్మ మీ మీదికి వచ్చునప్పుడు మీరు శక్తినొందెదరు. గనుక మీరు యెరూషలేములోను, యూదయ సమరయ దేశముల యందంతటను భూదిగంతముల వరకును నాకు సాక్షులైయుందురని వారితో చెప్పెను" (అపో.కా. 1:8). పరిశుద్ధాత్మ వచ్చినప్పుడు వారు సాక్షులగుదురు. పరిశుద్ధాత్మ వచ్చి యేమి చేయును? "అయితే ఆయన, అనగా సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు మిమ్మును సర్వసత్యములోనికి

నడిపించును. ఆయన తనంతట తానే యేమియు బోధింపక వేటిని వినునో వాటిని బోధించి సంభవింపబోవు సంగతులను మీకు తెలియజేయును" (యోహాను 16:13).

పెంతెకొస్తునాడు పరిశుద్ధాత్ముడు వచ్చెను. ఎంచుకొనబడిన సాక్షులు తమ సాక్ష్యము నిచ్చిరి (అపో.కా. 2:14-47). సువార్త ప్రకటింపబడెను (అపో.కా. 2:36). మారుమనస్సు పాపక్షమాపణలు ప్రకటింపబడెను (అపో.కా. 2:38). క్రీస్తునందే రక్షణ యున్నది (అపో.కా. 4:12). దేవుని యొక్క నానావిధమైన జ్ఞానము సంఘము ద్వారా తెలియజేయబడవలెను (ఎఫెసీ 3:10-11). అది ఇప్పుడు, ఎల్లప్పుడు జరుగవలయును (ఎఫెసీ 3:20-21). మనము ఈ సంగతులను మరువరాదు.

**- కీ॥శే॥ జె.సి. బెయిలీ**


**సత్యవాణి - క్రీస్తు సంఘము ద్వారా ఉచితంగా ఇయ్యబడుచున్న బైబిలు కరస్పాండెన్సు కోర్సులో మీరు, మీ సంఘ సభ్యులు చేరండి. ఆ పాఠములను మీయింటిలోనే పూర్తిచేసి తెలుగు బైబిలును ఉచితముగా పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి.**

SATYAVANI, P.O.Box-80 KAKINADA - 533 001.

**గమనిక: సత్యవాక్కు కావలసిన వారు సంవత్సరమునకు 50/- రూ॥లు చందా విధిగా పంపించవలయును.**

## సంక్షిప్తవార్తలు

వెస్ట్ కాకినాడ (సర్పవరం) క్రీస్తుసంఘము వారు మే నెల మొదటి తేదీ నాడు యువకుల సదస్సును ఏర్పాటు చేసి చక్కగా నడిపించిరి. యువకులైన Dr. స్టాన్లీ స్టీవెన్సన్ గారు కార్యక్రమమునంతా సమర్ధవంతముగా నడిపించిరి. కాకినాడ, పిఠాపురం, గొల్లప్రోలు ప్రాంతముల నుండి వచ్చిన అనేకమంది యువతీ యువకులు దానిలో పాల్గొనిరి. దానిలో Bro. త్యాగరాజు మడికి గారి కుమారులు సామ్యూల్ జోయల్‌రాజు గారు, Bro.పాల్‌నెహ్రూ గారి కుమారులు సామ్యూల్ ఆనంద్‌పాల్ గారు, మరియు రిక్కీగూటం గార్లు చక్కటి వాక్యపరిచర్యగావించిరి. చక్కటి ఆత్మీయానుభూతిని పాల్గొనిన ప్రతివారు పొందిరి, ప్రభువును స్తుతించిరి.

మే నెల 2వ తేదీ బుధవారం జగ్గంపేట మండలం రాజపూడిలో జరిగిన సువార్త కూటములో రిక్కీ గూటం గారు సతీసమేతముగా పాల్గొని వాక్యపరిచర్య చేసిరి. ఆ కూటమునకు అనేకమంది హైందవులు హాజరై క్రీస్తు సువార్తను వినిరి.

మే నెల మొదటివారములో విజయవాడ ఏరియాలోని క్రీస్తు సంఘములు గొప్ప బహిరంగ సువార్త కూటములను మూడుదినముల మట్టుకు నిర్వహించిరి. విజయవాడలో సువిశాలమైన జింఖానా గ్రౌండ్‌లో ఈ కూటములు ఏర్పాటు చేయబడెను. 3వ తేదీనాడు రాత్రివేళ కూటములో సోదరులు రిక్కీ గూటం గారు దేవుని గ్రంధము నుండి చక్కటి వర్తమానమునందించిరి. హాజరైన వారందరు సత్యవాణి T.V. కార్యక్రమములను గూర్చి, రిక్కీ గారి వాక్యపరిచర్యను గూర్చి ఆయనను అభినందించిరి.

మే నెల 4వ తేదీనాడు పాలమూరులో జరిగిన సువార్త కూటమునకు రిక్కీ గారు సతీసమేతముగా హాజరై వాక్య పరిచర్య చేసిరి. అక్కడ కె.జయానంద్ గారు సువార్త చాటుచున్నారు. కొన్ని మాసముల క్రితము అక్కడ జాషువా గారి సహకారముతో ఒక చక్కటి ఆలయము నిర్మించబడెను.

మే నెల 5వ తేదీ నాడు రామచంద్రపురంలో జరిగిన సువార్త కూటములో రిక్కీ గారు వాక్య పరిచర్య చేసిరి. సత్యవాణి నుండి బైబిలు కోర్సు పూర్తి చేసిన 50 మంది యువతీయువకులకు ఆయన ఉచితంగా బైబిళ్లను బహూకరించిరి. రామచంద్రపురంలో సోదరులు దేసింగ్ గారు వాక్యపరిచర్య చేయుచున్నారు.

మే 10వ తేదీ గురువారం వెంకటక్రిష్ణరాయపురంలో నిర్మించబడిన క్రీస్తు సంఘ ప్రార్ధన శాలను రిక్కీ గారు ప్రతిష్టించిరి. అక్కడ సోదరులు బి.సమూయేలు గారు సువార్త చాటుచున్నారు. ఆనాడు ఆయన కుమారుని వివాహము కూడ

అక్కడే జరిగేను.

మే 11 నుండి 21 వరకు జాషువా గూటం గారి రెండవ కుమారుడు సామ్యూల్ రోనీ గూటం గారు అమెరికా నుండి వచ్చి కొన్ని దినములు కుటుంబసభ్యులతో, స్థానిక సంఘముతో గడిపిరి.

మే 24వ తేదీనాడు మునిపెల్లలో నిర్మించబడిన క్రీస్తు సంఘ ప్రార్థన షెడ్‌ను రిక్కీ గారు ప్రతిష్టించిరి. అక్కడ జరిగిన కూటములో సోదరులు N. ఏలియా, N.రాజు, D. రంగారావ్ తదితరులు పాల్లొనిరి, వాక్యపరిచర్య చేసిరి. మునిపెల్లలో సోదరులు A.వెంకటరావ్, A.గోపాలకృష్ణ గార్లు సువార్త చాటుచున్నారు.

మే 25 నాటికి నందిగామలో సోదరులు గడ్డం మార్కు గారు సువార్త పని ప్రారంభించి 25 సంవత్సరములు పూర్తి అయిన సందర్భముగా ఏర్పాటు చేయబడిన కృతజ్ఞతా కూటము ఘనముగా జరిగినది. ఆ ప్రాంతపు సువార్తికులు పలువురు హాజరై మార్కు గారిని ఆయన సతీమణిని సన్మానించి అభినందించిరి.

2007 జూన్ 8వ తేదీనాడు రిక్కీగూటం దంపతులు కొన్ని నెలల పాటు అమెరికా వెళ్లనై యున్నారు. ఈ పత్రిక ముద్రించు సరికి వారు ప్రయాణము నిమిత్తమై సిద్ధపడుచున్నారు. వారిని గూర్చి చదువరులు, స్థానిక సంఘములు ప్రార్థించమనవి.

RNI Regd. No. 6997/98
Postal Regd. No. AP/KD-02/2006-2008

To

From:
SATYA VAKKU
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004